# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వము

పత్రికా ప్రకటన-2 తేదిః 28.8.2014.

ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతిని ఇప్పటి నుండి అధికారికంగా నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు వెల్లడించారు. సెప్టెంబర్ 9న జరిగే కాళోజి శత జయంతి సందర్భంగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో, పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మను ముఖ్యమంత్రి కోరారు. వరంగల్ కాళోజి ఫౌండేషన్ ప్రతినిధులతో గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. సెప్టెంబర్ 9న నిర్వహించే కాళోజి జయంతి, పాఠ్యపుస్తకాలు కాళోజి జీవిత చరిత్ర-రచనలు తదితర అంశాలపై ముఖ్యమంత్రి వారితో చర్చించారు. కాళోజి శత జయంతి సందర్భంగా వరంగల్‌లో రవీంద్రభారతి కన్నా గొప్పగా నిర్మించే కాళోజి కల్చరల్ సెంటర్‌కు తాను స్వయంగా శంకుస్థాపన చేస్తానని కూడా ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ భవనంలోనే కాళోజి రచనలు, ఆయన జ్ఞాపకాలు పదిల పరచాలని సిఎం చెప్పారు. అదే రోజు సాయంత్రం హైదరాబాద్ రవీంద్రభారతిలో కూడా అధికారికంగా నిర్వహించే జయంతిలో తాను పాల్గొంటానని ముఖ్యమంత్రి చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్, వరంగల్ నగరాలు అత్యంత ప్రాధాన్యత, చరిత్ర వున్న ప్రాంతాలని, కాని గత పాలకుల నిర్లక్ష్యం వల్ల వరంగల్ కావలసినంత అభివృద్ధి కాలేదని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు వరంగల్ నగరాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడం కోసం కృషి చేస్తున్నామని, ముఖ్యంగా వరంగల్‌ను తెలంగాణ సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చెప్పారు. ఇందులో భాగంగానే వరంగల్ నగరంలో కాళోజి పేరిట అద్భుతమైన కల్చరల్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తామని, అది వరంగల్ నగరానికే వన్నె తెచ్చే విధంగా వుంటుందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ విషయంలో డబ్బుకు వెనకాడేది లేదని ప్రకటించారు. కాళోజి శత జయంతి సందర్భంగా హైదరాబాద్, వరంగల్ నగరాలలో ప్రధాన కార్యక్రమాలు నిర్వహిస్తామని, ప్రతి గ్రామంలో కూడా జయంతి ఉత్సవం జరుగుతుందని చెప్పారు. జయంతి

సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు కూడా నిర్వహించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. కాళోజి జీవిత చరిత్ర, ఆయన రచనలను పాఠ్యాంశాలలో పెడతామని ముఖ్యమంత్రి ప్రకటించారు. కాళోజితో పాటు ఇతర తెలంగాణ విశిష్ట వ్యక్తుల జీవిత చరిత్రను కూడా భావి తరాలకు అందించాలని ముఖ్యమంత్రి చెప్పారు. వచ్చే ఏడాది నుండి పాఠ్యాంశాలను మారుస్తామని, అప్పుడు తెలంగాణ ప్రముఖుల జీవిత విశేషాలు పాఠ్యాంశాలలో వుంటాయని ముఖ్యమంత్రి చెప్పారు. సీమాంధ్ర పాలకులు మన చిహ్నలను చెరిపి వేశారని, వారి చిహ్నలను మనపై రుద్దారని సిఎం అన్నారు. ఇప్పుడు మన వాళ్ల గురించి మన భావి తరాలకు చెప్పుకోవాలని సిఎం అభిప్రాయపడ్డారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు కెవి.రమణాచారి, బివి.పాపారావు, ఎంపి కడియం శ్రీహరి, కాళోజి ఫౌండేషన్ ప్రతినిధులు అంపశయ్య నవీన్, బి.నర్సింగ్‌రావు, నాగిళ్ల రామశాస్త్రి, నందిని సిధారెడ్డి, పొట్లపల్లి శ్రీనివాసరావు, పి.అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

---

సిపిఆర్ఓ టూ సిఎం.